క్లుప్తంగా

స్కూల్ గేమ్స్ ఎంపికలు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీలకు సంబంధించి శుక్రవారం ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీలకు సుమారు 300 మంది బాలికలు హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రరావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భామిని: మండలంలోని బత్తిలి గ్రామానికి చెందిన కార్పెంటర్ చెరుకూరి శ్రీనివాసరావు లంగ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బత్తిలి విశ్వబ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు విరాళాలు సేకరించి బాధితుడికి శుక్రవారం అందజేశారు.

సందర్శన



విద్యా సామర్థ్యాలను అంచనా వేస్తున్న ఏఎంఓ కోటిబాబు

సీతంపేట: సామరెల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను పీఎంఆర్‌సీ ఏఎంఓ పి.కోటిబాబు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

వీరఘట్టం: మండలంలోని పాల్ల రోడ్డులో గాదెలంక వద్ద గురు వారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయని ఎస్సై జి.కళాధర్ తెలిపారు. సీతంపేట మండలంలోని సీదిమానుగూడకు చెందిన బిడ్డిక సోమయ్య బైక్‌పై ఇంటి నుంచి బయల్దేరి వీరఘట్టం వస్తుండగా, వీరఘట్టం మండలంలోని కొండవారగోర గ్రామానికి చెందిన ఆరిక మోహన రావు వీరఘట్టం నుంచి తన ఇంటికి టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలో గాదెలంక వద్ద ఆ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొట్టుకోవడంతో ప్రమాదం జరినట్లు ఎస్సై చెప్పారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలైన సోమయ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

చందాలతో రోడ్డు మరమ్మతులు



గుమడ వద్ద రహదారి గోతులు పూడ్చుతున్న అధికారులు

కొమరాడ: పార్వతీపురం మీదుగా కూనేరు వెళ్లే అంతఃరాష్ట్ర రహదారిపై భారీ గోతులు ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. నిత్యం ఈ రోడ్డులో వాహనాలు మోరాయిస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. రహదారి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో అధికారులు వాహనదారుల నుంచి చందాలు సేకరించి రోడ్డు మరమ్మతులు చేపడుతున్నారు. అయితే తూతూ మంత్రంగా గోతులు పూడ్చుతుండడంతో వర్షాలకు గోతుల్లో వేసిన మట్టి కొట్టుకుపోయి మరింత ప్రమాదకరంగా మారుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి శాశ్వత ప్రాతిపదికన రహదారి మరమ్మతులు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

క్రీడల్లో రాణించాలి



చెస్ ఆడుతున్న విద్యార్థులు

గరుగుబిల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో ప్రతిభ కనబరచాలని ఉల్లిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పీసీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి సుమారు 310 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగ, అథ్లెటిక్స్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. పీడీలు బీబీ శ్రీనివాసరావు, ఆర్.అప్పలనాయుడు పోటీలను పర్యవేక్షించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

కలెక్టర్ మెప్పు కోసమేనా..?

- వీరఘట్టం పాఠశాల ఆటస్థలంలో ఏర్పాటు చేసిన న్యూట్రీ గార్డెన్
- పర్యవేక్షణ లేక ఎండిపోయిన మొక్కలు
- అపహాస్యంగా మారుతున్న 'మనబడి – మనతోట'



వీరఘట్టం బాలుర ఉన్నత పాఠశాల వద్ద పరదాలతో అందంగా ముస్తాబు చేసిన న్యూట్రీ గార్డెన్

వీరఘట్టం: పాఠశాలల ఆవరణల్లో ఆకుకూరలు, కూరగాయల (న్యూట్రీ గార్డెన్స్) మొక్కలు సాగు చేసి మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించుకునేందుకు 'మనబడి – మనతోట' కార్యక్రమం అమలు చేస్తున్నారు. అయితే సరైన పర్యవేక్షణ లేక అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 4న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ వీరఘట్టం జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో చేపట్టిన మనబడి – మనతోట కార్యక్రమంలో పాల్గొన్నారు.

అయితే కలెక్టర్ వస్తున్నట్లు అకస్మాత్తుగా సమాచారం వచ్చిందనే నెపంతో పాఠశాల క్రీడా మైదానంలో న్యూట్రీ గార్డెన్ కోసం చుట్టూ అందమైన పరదాలు కట్టి చిన్న చిన్న కమతాలను ఉపాధి హామీ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కమతాల్లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ విత్తనాలు కూడా చల్లారు. కలెక్టర్ వెళ్లిన తర్వాత ఈ న్యూట్రీ గార్డెన్‌పై పర్యవేక్షణ కొరవడింది. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు వేసిన విత్తనాలు మొలకలెత్తాయి. అయితే గార్డెన్‌పై పర్యవేక్షణ లేకపోవడంతో రెండు రోజులుగా ఎండ తీవ్రతకు చిన్న చిన్న మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి.

ఖాళీగా ఎంతో స్థలం..

వాస్తవానికి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లోపల చాలా స్థలం ఉంది. ఆ స్థలంలో ఏర్పాటు



ఎండిపోయిన మొక్కలు

చేయాల్సిన ఈ గార్డెన్‌ను పాఠశాల బయట క్రీడా మైదానంలో ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. కలెక్టర్ మెప్పు కోసం ఈ నెల 4న హడావిడి చేసిన అధికారులు తర్వాత ఈ గార్డెన్‌ను గాలికి వదిలేశారని ఇక్కడ పరిస్థితులను చూస్తే స్పష్టమవుతోంది. ఆకు కూరలు, కూరగాయల వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరిస్తూ, స్వయంగా గార్డెన్‌ను సాగు చేయాలని కలెక్టర్ చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదనే చెప్పవచ్చు.

మాకు సంబంధం లేదు..

పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యూట్రి గార్డెన్‌తో మాకు ఎటువంటి సంబంధం లేదు. నిర్వహణ బాధ్యత ఉపాధ్యాయులదే. ఉదయం 9 గంటలకు పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయులు గార్డెన్ వైపు కన్నెత్తి చూడకపోవడం వల్లే మొక్కలు ఎండిపోయాయి. – సత్యంనాయుడు, ఉపాధి ఏపీఓ



విత్తనాలు జల్లుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ (ఫైల్)

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి..



సచివాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతులు, ఆయా సంఘ నాయకులు

పాలకొండ రూరల్: రైతులకు ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి హోదాలో నేడు నెరవేర్చాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని వెలగవాడ సచివాలయం సిబ్బందికి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు పెట్టుబడికి రూ.20 వేలు ఇస్తామన్న నాయకులు ఇప్పుడు ఎందుకు పెదవి విప్పడం లేదని ప్రశ్నించారు. 2023లో ఖరీఫ్, రబీ సీజన్లలో కరువు, తుపానుకు సంబంధించిన బీమా పరిహారం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు కాయల జయరాం, ఎం.రవికుమార్, దిలీప్, అప్పన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు సహకరించండి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు, సంరక్షకులు

పాలకొండ రూరల్: ప్రత్యేక అవసరాలు గల పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని వారికి ప్రభుత్వపరంగా సహకరించాలని సదరు పిల్లల తల్లితండ్రులు, సంరక్షకులు కోరారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ యశ్వంత్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భవిత కేంద్రాల్లో స్పీచ్‌థెరపీ, ఆక్యుపేషనల్, ఫిజియోథెరపీలో అనుభవం ఉన్నవారిని నియమించాలని కోరారు.

లప్పటిలో విషజ్వరాల విజృంభణ



లప్పటి గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ లప్పటి గిరిజన గ్రామంలో గత కొన్ని రోజులుగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకు జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. గ్రామానికి చెందిన ఆరిక స్వాతి, గుత్తిలమ్మ, తోయక కిందిరమ్మ, మూటక దేవి, సుధీర్, కుసుమమ్మతో పాటు పలువురు మంచం పట్టగా.. తోయక ఆలమ్మ, సీమమ్మ, మహేష్, తిరుపతిరావు, ఆరిక సరస్వతి తాడికొండ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. మరికొంత మంది జ్వరపీడితులు భద్రగిరి సీహెచ్‌సీలో చేరి చికిత్స తీసుకుంటున్నారు. వైద్యాధికారులు స్పందించి తక్షణమే గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతే మనందరి లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: పరిసరాల పరిశుభ్రతే మనందరి లక్ష్యం కావాలని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 1 వరకు 'స్వభావ స్వచ్ఛత–సంస్కార్ స్వచ్ఛత' కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు ఎంపీపీ ఉరిటి రామారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. మండల పరిషత్‌కు నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే భవన నిర్మాణం చేపడతామన్నారు. ఈ సందర్భంగా రహదారి మరమ్మత్తులపై ఆర్‌అండ్‌బీ జేఈని సభ్యులు నిలదీశారు. రహదారి మరమ్మత్తులకు సంబంధించి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని జేఈ ప్రమీల తెలిపారు. విద్యుత్ లైన్‌ల నిర్వహణకు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ శంకరరావు సభ్యులకు కోరారు. సీతానగరం మండలం బూర్జి నుంచి గరుగుబిల్లి మండల విద్యుత్ సబ్‌స్టేషన్‌కు నూతన లైన్ ఏర్పాటుకు ఆమోదం వచ్చిందని, ఈ పనులు పూర్తయితే నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు అవకాశం ఉంటుందని సభ్యులకు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు బి.లక్ష్మి, ఎస్.లక్ష్మి, ఎంపీడీఓ జి.పైడితల్లి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సత్యలక్ష్మీకుమార్, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, మండల అధికారులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్



టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

గరుగుబిల్లి: మండలంలోని రావివలసలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా శ్రీరామ యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పదోతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

వరద బాధితుల కోసం బియ్యం సేకరణ



సేకరించిన బియ్యంతో ట్రైబల్ రైట్స్‌ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విజయవాడ వరద బాధితుల కోసం కురుపాం మండలంలోని తూర్పుముఠా ప్రాంతంలో బియ్యంను సేకరించారు. ఈ మేరకు ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటి కుప్పట రామకృష్ణ, మొండెంఖల్లు, నీలకంఠాపురం సర్పంచ్‌లు గౌరీశంకరరావు, మన్మథరావు తదితరులు నీలకంఠాపురం, ధర్మలక్ష్మీపురం, మొండెంఖల్లు పరిసర గ్రామాల్లో సుమారు 10 క్వింటాళ్ల బియ్యం సేకరించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. సేకరించిన బియ్యాన్ని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విజయవాడ వరద బాధితులకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నీలకంఠాపురం ఎస్సై నీలకంఠం, టీడీపీ మండల కార్యదర్శి శంకర్, జేఏసీ నాయకులు బిడ్డిక రామారావు తదితరులు ఉన్నారు.

ఏచూరి మరణం తీరని లోటు



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి దావాల రమణారావు అన్నారు. మండల కేంద్రంలో ఏచూరి చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీలో ఏచూరి గొప్ప మానవతావాదని తెలిపారు. కార్యక్రమంలో కాద రాము, దూసి దుర్గారావు, గిరి హేమసుందరరావు, దూసి పాపారావు, గుండు సతీష్, కుప్ప రమణ, కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

కోసంగిలో..

సీతంపేట: మండలంలోని కోసంగిలో కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు జె.సుందరమ్మ, పి.సాంబయ్యలు మాట్లాడుతూ.. దేశ రాజకీయాలలో కష్ట జీవుల తరపున అలుపెరగని పోరాటం చేసిన ఘనత ఏచూరికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరాములు, గంగాధర్, మధుసూదనరావు, నీలయ్య, తదితరులు పాల్గొన్నారు.



భామిని:కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ కార్యకర్తలు

నివాళులు..

భామిని: వామపక్ష జాతీయ నాయకుడు కామ్రేడ్ సీతారామ్ ఏచూరి మృతికి సంతాపంగా సీపీఎం మిత్రపక్ష కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. బాలేరులో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘ కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తే చర్యలు



గోపాలపురం గ్రామం వద్ద ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పాలకొండ: నాగావళి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని గోపాలపురం గ్రామం వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక ర్యాంపును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడా ఇసుక ర్యాంపులకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. నదీతీరంలో ర్యాంపులు వేసి ఇసుక తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. పూర్తి స్థాయిలో ఇసుక ర్యాంపులపై దర్యాప్తు చేపట్టాలని తహసీల్దార్ బాల మురళీకృష్ణను ఆదేశించారు. అనంతరం మంగళాపురం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ నారాయుడు

సీతంపేట: చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి పి.నారాయుడు అన్నారు. మండలంలోని చిన్నబగ్గ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని హెచ్ఎం, వార్డెన్‌లను ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంఓ కోటిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయిలో పని సర్దుబాటు..

- యూటీఎఫ్ నాయకులు



ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

వీరఘట్టం: ఉపాధ్యాయులకు పని సర్దుబాటును మండల స్థాయిలోనే చేపట్టాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఈఓ కార్యాలయం సిబ్బందికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సింగిల్ టీచర్ ఉన్న చాలా పాఠశాలల్లో 50 మందికి పైబడి విద్యార్థులున్నారని తెలిపారు. 50 లోపు విద్యార్థులున్న పాఠశాలల్లో ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను మండల స్థాయిలోనే సర్దుబాటు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సెలవులను వెంటనే ఆమోదించాలన్నారు. మూడు స్కూల్ కాంప్లెక్స్‌లను అనుసంధానం చేసి ఇకమీదట ఒకేచోట కాంప్లెక్స్ సమావేశాలు జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మజ్జి పూడిరాజు, కురమాన గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకే..



నవగాం విద్యుత్ సబ్ స్టేషన్‌లో చేపడుతున్న మెయింటనెన్స్ పనులు

వీరఘట్టం: రానున్న రోజుల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా పంపిణీ చేసేందుకే సబ్‌స్టేషన్లలో మెయింటినెన్స్ పనులు చేపడుతున్నట్లు ట్రాన్స్ కో ఈఈ టి.గోపాలకృష్ణమూర్తి అన్నారు. నవగాం సబ్‌స్టేషన్‌లో చేపట్టిన బ్రేకర్, ఎర్త్‌పిట్స్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉంటే స్థానిక విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని కోరారు.

సమీకృత వ్యవసాయ విధానానికి ప్రోత్సాహం

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి



సమీకృత వ్యవసాయ విధానంపై రైతులతో మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: సమీకృత వ్యవసాయవిధానాన్ని ప్రోత్సహించనున్నట్లు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని బూర్జగూడలో ఆర్ట్స్, నాబార్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవ ప్రాజెక్టును శుక్రవారం సందర్శించారు. మధుసూదనరావు అనే రైతు అనుసరిస్తున్న వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం విధానంలో ఏయే పంటలు పండిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.అలాగే పుబ్బాడగూడ గ్రామానికి వెళ్లి అక్కడి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ దినేష్‌రెడ్డి, ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు, మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సీఈఓ బి.శంకరరావు, శ్వేత, సోని, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

19న క్రీడాకారుల ఎంపిక పోటీలు



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ, తదితరులు

పాలకొండ రూరల్: నియోజకవర్గ స్థాయి పాఠశాల క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 19న నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఈఓ పి.కృష్ణారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా విద్యాశాఖాధికారి సూచనలతో సీతంపేట ఎన్‌టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో చేపడతామన్నారు. సమావేశంలో ఎంఈఓ కె.సోంబాబు, పీఈటీలు జాకబ్ దయానంద్, వి.పుష్పనాథం, ఎం.రామకృష్ణ, తదితరులున్నారు.

ఐటీఐతో ఉద్యోగావకాశాలు



ఉపాధ్యాయులకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: త్వరితగతిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఐటీఐ చదువుతోనే సాధ్యమని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ అన్నారు. ఐటీఐ వద్ద శుక్రవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటీస్ పూర్తి చేసిన వెంటనే పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. అంతేకాకుండా విద్యుత్, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థులు నిర్లక్ష్యం వహించకుండా శిక్షణ కాలంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ సేవలందిస్తున్న ఇన్‌స్ట్రక్టర్లకు జ్ఞాపికలను అందజేశారు.